అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 154. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.28.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## మహిళా వర్సిటీకి కావాల్సిన నిధులను సమకూరుస్తాం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మహిళా వర్సిటీ అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూరుస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్‌లను పరిరక్షించడంతోపాటు వాటిని పునరుద్ధరించడానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు. మహిళా విద్యార్థులకు కావాల్సిన తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావాల్సిన వసతి గృహాలు, వీసీ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రదేశాల ను పరిశీలించామన్నారు.

## హెచ్‌సీయూలో ప్రమాదం

శేరిలింగంపల్లి :అమృత్ తెలంగాణ: రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎక్స్‌టెన్షన్ బాల్కానీ గురువారం కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. యూనివర్సిటీలో నూతనంగా అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. గురువారం కూడా పనులు కొనసాగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా బిల్డింగ్ బాల్కానీ కూలిపో యింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కార్మికులను అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద మరెవారైనా చిక్కుకొని ఉన్నారేమో అనే కోణంలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే నిర్మాణం లో ఉన్న స్తంభాలు, కాంక్రీట్ స్లాబ్‌లు కూలిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధార ణకు వచ్చారు.

# ప్రధాని మోడీ డిగ్రీ వివాదం

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయాలనే కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాలను సవాల్ చేస్తూ డిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) దాఖలు చేసిన పిటీషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు గురువారం రిజర్వ్ చేసింది. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వ్ చేశాం' అని జడ్జి సచిన్ దత్తా ఇరు పార్టీలకు తెలిపారు. సమాచార హక్కు చట్టంకింద నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన దరఖాస్తు ప్రకారం ఢిల్లీ యూనివర్సిటీలో 1978లో బీఏ పరీక్ష ఉత్తీర్ణులైన అందరి రికార్డులు తనిఖీ చేయడానికి సీఐసీ 2016 డిసెంబర్ 21న అనుమతి ఇచ్చింది. ఇదే ఏడాదిలో మోడీ డిగ్రీ ఉ త్తీర్ణులయ్యారు. అయితే ఈ అనుమతిని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టును యూనివర్సిటీ ఆశ్రయించింది. దీంతో ఈ ఉత్తర్వులపై హైకోర్టు 2017 జనవరి 23న స్టే విధించింది. ఎలాంటి ప్రజాప్రయోజనం లేకుండా కేవలం ఆసక్తితో ఆర్టీఐ చట్టం కింద ప్రయివేటు సమాచారాన్ని కోరే హక్కులేదని డీయూ వాదిస్తుంది. 1978 బీఏ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరీ రికార్డులను కోరుతూ ప్రధానమంత్రి, ఆర్టీఐను 'జోక్'గా మార్చివేసారని యూనివర్సిటీ పేర్కొంది. డీయూ తరపున గురువారం



విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ 'కోర్టుకు రికార్డులను చూపించడంలో విశ్వ విద్యాలయానికి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపారు. సీఐసీ ఉత్తర్వులను కొట్టివేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# ఢిల్లీలో హిందూత్వ ఎజెండా

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: ప్రధాని మోడీ ప్రభుత్వం హిందూత్వ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకువెళుతోంది. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ నగరాలు, వీధులకు ఉన్న ముస్లిం పేర్లను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తమ నియోజకవర్గాల్లో ఉన్న ముస్లిం పేర్లను మార్చాలంటూ గురువారం బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. 'నజాఫ్‌గఢ్' పేరును 'నహర్‌ఘర్'గా మార్చాలని బీజేపీ ఎమ్మెల్యే నీలం పహల్వాన్ తన ప్రతిపాదనలలో పేర్కొన్నారు. మొఘల్ పాలకుడు ఔరంగజేబు నియోజకవర్గం పేరును మార్చారని, అసలు పేరును పునరుద్ధరించాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. ఆర్‌కెపురం నియోజకవర్గం లోని మహ్మద్‌పూర్ పేరును మాధవపూర్‌గా మార్చాలంటూ ఆర్‌కెపురం ఎమ్మెల్యే అనిల్ శర్మ సైతం అసెంబ్లీలో ప్రతిపాదన సమర్పించారు. తన నియోజకవర్గం ఢిల్లీ గ్రామీణ ప్రాంతానికి చెందినదని,



హర్యానాలోని మూడు ప్రాంతాలకు సరిహద్దుగా ఉందని నీలం పహల్వాన్ అసెంబ్లీకి తెలిపారు. మొఘల్ పాలకుడు, చక్రవర్తి షాఆలం-2 నజఫ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ ప్రాంతంలో చాలా అణచివేత జరిగిందని అన్నారు. అనంతరం 1857 తిరుగుబాటు సమయంలో.. రాజానహర్ సింగ్ పోరాడి తిరిగి ఈ ప్రాంతాన్ని ఢిల్లీ ప్రావిన్స్‌లోకి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుండి ఎంపీ పర్వేష్ వర్మతో సహా తాము నజాఫ్‌గఢ్ పేరును నహర్‌ఘర్‌గామార్చేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఈమారు చాలా ముఖ్యమని, ముస్లింల హయాంలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, ఈ ప్రాంత రాజులు వారి ఉనికి కోసం పోరాడారని అన్నారు.

# ప్రపంచంతోనే పోటీ

## తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. తమ పోటీ భారతదేశంలోని మెట్రో నగరాలతో కాదనీ, ప్రపంచంతోనే పోటీ అని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీగా మారుస్తానని సీఎం ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోపునే దేశ, విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయనీ, ఉద్యోగాల కల్పనలో నెంబర్‌వన్‌గా నిలిచినట్టు ప్రకటించారు.

తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని గతంలో తాను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొంత మంది సందేహాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని వారే నమ్ముతున్నారని తెలిపారు. తెలంగాణ ఎదుగుదలను ఎవరూ ఆపలేరన్నారు. తమ పోటీ ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైతో కాదని తానంటే కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారని చెప్పారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశామని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నట్టు వెల్లడించారు. ఇవి చేశాక హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ఎదుగుతోందని ప్రపంచవే అంగీకరిస్తోందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన అమెజాన్ ప్రారంభం, ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సు నిర్వహణ, గ్లోబల్ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ రాక రాష్ట్రానికే కాక దేశానికే



గర్వకారణంగా నిలిచాయని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ సీఎల్ 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో పని చేస్తోందనీ, డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తోందని చెప్పారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా ఎదిగిందని గుర్తుచేశారు. ప్రతి రోజు బహుళ జాతి కంపెనీలతో కొత్త అవగాహనా ఒప్పందాలు, పెద్ద సంస్థలు తెలంగాణకు రావడం, గతం సంవత్సరం చేసుకున్న ఒప్పందాల మేరకు కొత్త సౌకర్యాల ప్రారంభం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయని తెలిపారు.

# ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లకుండా హరీశ్ రావును అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సొరంగంలో చిక్కుకుపోయిన 8 మందిని కాపాడేందుకు నాలుగు రోజులుగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లేందుకు హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు పోలీసుల చర్యను నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన



వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

# రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి

మహబూబ్‌నగర్ :అమృత్ తెలంగాణ: ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రెండ్రోజుల్లో బయటకు తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ప్రాజెక్టు వద్దకు వచ్చి మాట్లాడిన తీరు పట్ల ఆక్షేపించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సొరంగం పనులు చేశామంటున్న బీఆర్ఎస్ నేతలు ఎవరి దగ్గర అనుమతులు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పదేండ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో మళ్లీ సొరంగం పనులు పున్ణప్రారంభిస్తామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్న హరీశ్‌రావుకు కాంగ్రెస్‌ను విమర్శించడానికి సిగ్గుండాలన్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందని, బీఆర్ఎస్ మానస పుత్రిక అని చెప్పుకుంటున్న పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ఎడమ గట్టు విద్యుత్ ప్లాంట్‌లో మంటలు చెలరేగినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు సందర్శనకు వెళితే అరెస్టు చేయలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయం.. బీఆర్ఎస్‌కు మరో న్యాయం ఉండదని ఈ సందర్భంగా తెలుసుకోవాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టులో ఏడుగురు కార్మికులు చనిపోతే నోరెత్తని హరీశ్‌రావు ఇప్పుడు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆశలు వదులుకున్నట్టేనా..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలపై అధికారులు ఆశలు వదులుకున్నట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగి ఆరు రోజులు కావడంతో వారు సజీవంగా ఉన్నారా ? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




సొరంగంలో భారీ ఎత్తున మట్టి కూలడం, నీరు, బురద చేరడంతో ప్రాణాలతో ఉండే అవకాశం తక్కువని భావిస్తున్నారు. వారంతా బురదలోనే టన్నెల్ బోరింగ్ మెషీన్ టీబీఎం చుట్టూ కూరుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఒకవేళ ప్రమాదంలో గాయపడినా నీళ్లు, ఆహారం లేకుండా జీవించడం కష్టమని అంటున్నారు.

టన్నెల్ బోరింగ్ మిషన్ కటింగ్

కార్మికులను కాపాడేందుకు టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంకిగా మారడంతో దాన్ని కట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. పనుల్లోనూ మరింత వేగం పెంచారు. గురువారం నుంచి కటింగ్ పనులు ప్రారంభిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు మిషన్ భారీగా దెబ్బతింది. ఆ తర్వాత ఒత్తిడితో దాని వ్యర్థాలు ముందుకు తోసుకొచ్చాయి. దాన్ని దాటి వెళ్తేగానీ కార్మికులను కాపాడే ప్రయత్నాలు ఫలించవు. అయితే ప్రమాదం జరిగిన మూడో రోజునే వాటిని తొలగించేందుకు కట్టర్లు, జనరేటర్లు తీసుకెళ్లారు. అయితే కట్ చేసేందుకు జయప్రకాశ్ అసోసియేట్స్ యాజమాన్యం ఒప్పుకోలేదు. భారీ ఖర్చుతో కూడుకోవడం, టీబీఎంను కట్ చేస్తే తిరిగి పనులు ప్రారం భించడం కష్టమవుతుందని భావించారు. కానీ, బుధవారం ఆ సంస్థ చైర్మెన్ జయప్రకాశ్ గౌర్ ఢిల్లీ నుంచి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంత్రులు, అధి కారులు, కంపెనీ ప్రతినిధులు, సహాయ బృందాలతో చర్చల అనంతరం టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నేవీ, ఆర్మీ నిపుణులతోపాటు ర్యాట్ హోల్ మైనర్స్ ప్రత్యేక నిపుణులు ప్రమాదస్థలానికి చేరుకుని టన్నెల్‌లో నుంచి బురదను బయ టికి పంపే చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. సహాయక చర్యలపై అధికార యంత్రాంగం ఎలాంటి సమాచారాన్నీ బయ టకు రానివ్వడం లేదు. సొరంగం ప్రవేశ మార్గం వద్దకు మీడియా సహా ఎవరినీ అనుమతించడం లేదు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత ప్రభుత్వ వైఫల్యమే: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం సొరంగంలో నీటి తొలగింపు పనులు చేపట్టి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయన, రెండు రోజుల్లో సహాయక చర్యలను పూర్తి చేస్తామని తెలిపారు. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకాల పనులు చేపడతామని వెల్లడించారు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కన పెట్టారని, ఈ టన్నెల్‌ను పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవని ఆయన అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులను నింపుకోవడానికేనని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును కడితే అది మూడేళ్లకే కూలిపోయిందని అన్నారు. గతంలో శ్రీశైలం పవర్ ప్లాంటులో అగ్ని



ప్రమాదం జరిగి ఆరుగురు ఉద్యోగులు మృత్యువాత పడితే కేసీఆర్ వెళ్లి చూడలేదని విమర్శించారు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగినప్పుడు కూడా ఆరుగురు చనిపోయారని, అప్పుడూ స్పందించలేదని అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది భక్తులు చనిపోతే కేసీఆర్ వెళ్లలేదని విమర్శించారు. మాసాయిపేట రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోయినప్పుడు కూడా ఆయన పరామర్శించలేదని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు మాత్రం హరీశ్ రావు ప్రమాదం జరిగిన చోటుకు వచ్చి రాజకీయం చేయాలని చూశారని ధ్వజమెత్తారు. హరీశ్ రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సొరంగంలో నిపుణుల చర్యలకు ఇబ్బంది కావొద్దని అందరినీ లోనికి పంపించడం లేదని వెల్లడించారు. బురద తొలగింపు పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

# చిట్టీల పేరుతో రూ.120 కోట్లు మోసం!

జూబ్లీహిల్స్ :అమృత్ తెలంగాణ: వారిద్దరు తండ్రీకొడుకులు. హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లోని రవీందర్ నగర్ కాలనీలో ఉంటూ మేస్త్రీ పని చేశారు. ఆ తర్వాత చుట్టుపక్కల పరిచయాలతో చిట్టీలు వేస్తూ, అధిక వడ్డీలు ఇస్తామని చెప్పి అనేకమంది వద్ద డబ్బులు వసూలు చేశారు. అనంతరం సుమారు రూ.120 కోట్లు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించారు. రెండ్రోజులుగా బాధితులు లబోదిబోమంటూ నిందితుల ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఇందుకు సంబంధించి పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లయ్య, అతని కుమారుడు రామాంజనేయులు 20 సంవత్సరాలుగా ఎస్సార్ నగర్‌లోని రవీందర్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. రూ.3 కోట్ల విలువైన జీ ప్లస్ ఫోర్‌లో నివాసమున్నారు. వారు మొదట మేస్త్రీ పనిచేసి, ఆ తర్వాత బిల్డర్‌గా పనిచేస్తూ చిట్టీలు వేస్తూ కాలనీలో అందరితో పరిచయం చేసుకొని నమ్మకం కలిగించారు. సుమారు 1500 మంది అతని వద్ద చిట్టీలు వేస్తున్నారు. లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు వేస్తూ సభ్యులను చేర్చుకొని, అదే విధంగా వడ్డీ వ్యాపారం కూడా చేయసాగారు. అయితే, కొందరికీ చిట్టీలు అయిపోయినా వారికి తండ్రి కొడుకులు తిరిగి డబ్బులు ఇవ్వకుండా తిరిగి కొత్త చిట్టిలో సభ్యత్వం చేర్చుకొని ప్రతినెలా చిట్టి డబ్బులు తీసుకునేవారు. ఇదిలా ఉండగా ఈ నెల 23న తండ్రీకొడుకులు హైదరాబాద్ విడిచి పారిపోయారు. దాంతో రెండ్రోజులుగా వారి ఇంటి ముందు బాధితులు ఆందోళనకు దిగారు. చిట్టీలు వేసిన వారిలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ.. ఇండ్లల్లో పని చేస్తున్నవారు సుమారు 1000 మంది వరకు ఉన్నారని తెలిసింది.

## సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్లి కే గ్రామ కమిటీ ఎన్నిక..



సంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సభ్యుల ఎన్నిక

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 27 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని అర్లి కే లొ గురువారం సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమత ఫౌండేషన్ గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్,జనరల్ సెక్రటరీ ఎల్లన్న,సెక్రటరీ వినాయక్ రాజ్,కోశాధికారి ముకేష్ సభ్యులుగా మదూకర్, కైలాష్, శ్రీనివాస్ ,రాజు, సిందే శ్రీకాంత్, సుధాకర్ ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో సీఈఓ అనిల్ కుమార్ తో పాటు సభ్యులు ముత్యం పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ ను పరిశీలించిన డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, మాజీ మంత్రి వేణుగోపాల చారి.......



నర్సాపూర్ జి ఎమ్మెల్సీ ఎన్నికల సరలిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్న డిసిసి అధ్యక్షులు మాజీ మంత్రి

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 27 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు మాజీ మంత్రి సముద్రాల వేణు గోపాలాచారి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు .ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు ఇంద్రకరణ్ రెడ్డి ,అజీమ్ ,మాజీ ఎంపీపీ అనిల్ ,ఉమ మహేశ్వర్ ,భోజన్న కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

## నిర్మల్ జిల్లాలో ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు



కుబేర్ మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 27 గురువారం జరిగిన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నిర్మల్ జిల్లా పట్టబద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నరు అదేవిధంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పందరి, విశ్రాంత ఉపాధ్యాయులు ప్యాట లక్ష్మణ్, న్యాయవాది ప్రవీణ్, ధర్మ కిరణ్, పర్వత్వార్ శివరాం, సూది గంగాధర్, కందూరు శ్రీనివాస్ కుబీర్ మండలంలోని పలువురు పట్టభద్రులు వారి ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది.

## ముధోల్ పశుపతినాథ్ ఆలయం నందు తాళ సప్తమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే. రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ముధోల్ ఫిబ్రవరి 27 అమృత్ తెలంగాణ ముధోల్ మండల కేంద్రంలోని ప్రాచీన దేవాలయం శ్రీ పశుపతి నాథ్ ఆలయంలో పరమశివున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, తాళ సప్తమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతించి శాలువతో సత్కరించారు. విట్టల-రుక్మాబాయి దేవతామూర్తులకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



శాలువతో ఘనంగా సన్మానించి పశుపతినాథ్ ఆలయ ప్రతిమను ఎమ్మెల్యేకు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


## నందన్ రాజరాజేశ్వర ఆలయంలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



నందన్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ దాత కూన మహేష్ దంపతులు కుటుంబ సభ్యులు

వేడుకల్లో పాల్గొన్న ఆలయ దాత కూన మహేష్, కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ) ఫిబ్రవరి 27 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని నందన్ గ్రామంలో గల శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానం నందు ఆలయ కర్త కూన.మహేష్, ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలందరూ రాత్రి జాగరణలో పాల్గొన్నారు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో కూన రవికుమార్,కూన గంగన్న,కూన సవిత,కూన లింగన్న,లింగన్న, సంజీవ్, టికి భోజన్నా ఇంకా గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆలోచించండి మేధావులారా



అమృత్ తెలంగాణ బ్యూరో కెవిల్ రాములు, ఎన్నో పుస్తకాలు చదివి డాక్టర్, ఇంజనీర్, లాయర్, ప్రొఫెసర్, సైంటిస్ట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఉద్యోగి అయిన తర్వాత కూడా మనసులో మూఢనమ్మకాలు, కుళ్లిపోయిన ఆలోచనలు, అశాస్త్రీయ పాత పద్ధతులు అలాగే ఉండిపోతే, ఈ పుస్తక జ్ఞానం గాడిదపై పెట్టిన పుస్తకాల భారం లాంటిది. మీ మనస్సు కపట మూఢనమ్మకాలతో నిండినప్పుడు మీ జ్ఞానం పనికిరానిది అయినప్పుడు ఇంత జ్ఞానాన్ని సంపాదించి ప్రయోజనం ఏమిటి...

## పోలీస్ అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారి వ్యవహరించవద్దని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గోదావరిఖని .నస్పూర్ మంచిర్యాల కేంద్రాల్లో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు ఓటు వేసిన ఓటర్లు బాహటంగా భాజపా గెలుస్తుందని చెబుతుండడంతో ఓటమిని ఒప్పుకోలేని కాంగ్రెస్ నాయకులు గందరగోళం సృష్టించాలని ఉద్దేశంతో పోలీసుల సాయంతో నస్పూర్ లో సుగుణాకర్ ఎస్ఐ భాజపా కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం తోపాటు పోలీస్ స్టేషన్ కు తరలించడం మంచిది కాదని ఆయన అన్నారు అదేవిధంగా గోదావరిఖనిలో న్యాయవాదులు భాజపాకు మద్దతుగా ఉండడంపై గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి న్యాయమూర్తు లతో దురుసుగా వ్యవహరించడం పై ఆయన మండిపడ్డారు అధికార పార్టీ అండదండలతో అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు పట్టబద్రుల ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో భాజపా బలపరిచిన అభ్యర్థులు గెలుస్తున్నారని విషయాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ గుండాలు కేంద్రాల్లో అలజడి సృష్టించడం ఓటర్లకు డబ్బులు పంచడం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

చేశారని ఆయన అన్నారు కాంగ్రెస్ పాలన గమనించిన మేధావి వర్గమైన పట్టభద్రులు ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కారం కావాలంటే శాసనమండలిలో గొంతు ఎత్తి నిలదీయాలన్న భాజపా అభ్యర్థులే సరైన వారిని గుర్తించి ఓటు వేశారని ఆయన అన్నారు ప్రెస్ మీట్ కార్యక్రమంలో విజయ్ .నగేష్ లాలమన్న .రఘుపతి. వేద వ్యాస్ దినేష్ మటొలియ. రాజన్న .శివ. తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : లోకేశ్వరం మండల కేంద్రం జెడ్ పి ఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన 68 వ నంబరు శాసనమండలి ఎన్నికల కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఏర్పాటు చేసిన తాగునీరు, అత్యవసర వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లను అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఎంతవరకు కట్టుదిద్ధమైన భద్రతను కొనసాగించాలన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



కాంగ్రెస్ కార్యకర్తల నుండి ఎమ్మెల్సీ ఓటింగ్ తెలుసుకుంటున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ రోజు ఉమ్మడి ఆదిలాబాద్ – కరీంనగర్– నిజామాబాదు మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కొరకై కార్యకర్తలకు ఉత్తేజపరుస్తూ అదిలాబాద్ టౌన్ లో గల సరస్వతీ నగర్ పోలింగ్ బూత్, భుక్తాపూర్,తిరుపల్లి , డైట్ గ్రౌండ్ , హ్యాండ్ క్యాప్ కాలనీల్లో ఉన్న పోలింగ్ బూత్ లను పర్యవేక్షించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు ఎన్నికలు పూర్తి అయ్యేవరకు కేంద్రం వద్దనే ఉండాలని ఓటు వేయడానికి వచ్చే ఓట్లరకు ఓటింగు విధానం పైన అవగాహన కల్పించాలని కోరారు. శ్రీకాంత్ రెడ్డి వెంట మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కుదురుపాక సురేష్, వెంకటేష్, రేండ్ల రాజన్న, గౌతమ్, అడేల్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నమోదైన ఓటింగ్ తుది వివరాలు.





సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్సీ పోలింగ్ శాతపు వివరాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతం 66 ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ శాతం 81

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : నిర్మల్ జిల్లాలో శాసనమండలి ఓటింగ్ పూర్తయింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల సమయం ముగియగా. ఆ సమయానికి వరుసలో నిలబడి ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లాలో 1282 మంది పురుష, 684 స్త్రీ ఉపాధ్యాయ ఓటర్లను కలుపుకొని మొత్తం 1966 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉండగా వీరిలో 1146 మంది పురుష, 609 మంది స్త్రీ ఉపాధ్యాయ ఓటర్లు కలుపుకొని, 1755 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 89.27 గా నమోదయింది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 11497 పురుష, 5644 స్త్రీ ఓటర్లను కలుపుకొని మొత్తం 17141 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వీరిలో 8434 మంది పురుష, 4008 మంది స్త్రీ ఓటర్లను కలుపుకొని మొత్తం 12442 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 72.59 శాతం ఓటింగ్ నమోదయిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

## జిల్లా అధ్యక్షుడు జానారెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి ..

నెల్లికుదురు : మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి కి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి అని ప్రదేశ్ కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్ పార్టీ అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ దశాబ్ద కాలంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కుటుంబం కు ఒక పెద్ద దిక్కుగా ఉంటూ జిల్లా లో పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన కష్టసుఖాలలో ఆదుకున్న వ్యక్తి జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి కుటుంబం ఒకటే అని అన్నారు.కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకి అండగా వుంటూ ప్రతి కార్యకర్తకు ఏ ఆపద కష్టం వచ్చింది అని ఎవరు తలుపు తట్టిన నేనున్న అంటూ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూన్న వ్యక్తి భరత్ చందర్ రెడ్డి అని తెలిపాడు. మొన్న జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లా పరిధిలోని 5 గురు ఎమ్మెల్యే లకు అత్యధిక మెజార్టీని ఇచ్చి గెలిపించిన ఘనత కేవలం ఆయనకి దక్కిందని అన్నారు.

# విధులకు గైర్హాజర్ అయిన వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.











గుడిహత్నూర్ మండలం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన MLC పొలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాజర్షి షా.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గురువారం ఇంద్రవెల్లి మండలం లోని ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భం లో మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ తో పాటు CHO సందీప్, PHN జ్యోతి, సూపర్వైజర్ సురేష్ , MLHP పూజ లు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అవడం తో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదనపు డీఎంఎచ్ ఓ మనోహర్ తో ఫోన్లో మాట్లాడుతూ విధులకు గైర్హాజరైన వారి పై ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లవేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు . అంతకుముందు ఆసుపత్రి లోని మెడిసిన్ స్టోర్ రూమ్, ఒపి తో పాటు ప్రసవాల గది, ప్రాథమిక పరీక్ష గది, ఈసీజీ గదులను ,ARU, ASV, TT ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయా లేదా, ఐరెన్ ఫోలిక్ మాత్రలు పాఠశాలల లో ప్రతి వారం అందించాల్సి ఉంటుందనీ, విద్యార్థులకు ఇరన్ ఫొలిక్ మాత్రలు ఇస్తున్నారా లేదా, తదితర వివరాలను డాక్టర్ పూజిత ను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్ చెక్ చేసి రిజిస్టర్ లో సంతకం చేసిన ప్రకారం వైద్యులు, సిబ్బంది ఉన్నారా , లేరా ? పరిశీలించి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ ను ఆదేశించారు. ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా స్టాక్ పూర్తికాక ముందే ఇండెంట్ చేసి మందులను తెప్పించుకోవాలనీ, గర్భిణీ ల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు. అనంతరం టాయిలెట్ ను పరిశీలించగా శుభ్రంగా లేకపోవడం తో అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, రజినీకాంత్, డీఎంఎల్టీ అన్సారి, తదితరులు ఉన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# జిల్లాలో వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల బందోబస్తు ఏర్పాటు పరిశీలన . :: జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపిఎస్.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని మిని స్టేడియం లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలీసు రూట్ మొబైల్ అధికారులు, ఆర్మడ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్ లకు పటిష్టమైన భద్రతతో తీసుకువెళ్లడం జరిగింది. నిర్మల్ పట్టణం, దిలావార్పూర్, కుంటాల, భైంసా పట్టణం , ముధోల్ , మామడ , ఖానాపూర్ లోని పొలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి పోలీస్ అధికారులకు, సిబ్బందికి పోలింగ్ బందోబస్త్, భద్రత పై ఆదేశాలు, పలు సూచనలు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ...

నిర్మల్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 46. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో 12 పట్టభద్రులు, 04 ఉపాధ్యాయ మరియు రెండు ఒకే దగ్గర ఉన్నవి 15 పోలింగ్ కేంద్రాలు దానికి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టారు . నిర్మల్ జిల్లాలో ఎన్నికలలో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్తు పోలింగ్ కేంద్రాల చుట్టూ కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ పొందుపరిచామని. ఇందులో భాగంగా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్లు, స్ట్రైకింగ్ ఫోర్స్, టీములుగా విభజించామని వీటిలో భాగంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంతో పాటు అనుకోని సంఘటన సంభవిస్తే దాన్ని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీంను ఏర్పాటు చేశామని ఇప్పటికే ప్రతి ఒక్క టీం తమ తమ స్థానాలలో విధులు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని ఎస్పీ గారు తెలియజేశారు. అలాగే ఓటు వేసిన వారిని పోలింగ్ కేంద్రాలలో వేచి ఉండకుండా బయటకు పంపించాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే ఓటింగ్‌కు వచ్చేవారి వాహనాల పార్కింగ్ చేసుకునేలా, పోలింగ్ స్టేషన్లకు వచ్చిపోయే వారికి అంతరాయం కలగకుండా అన్నిచర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల బందోబస్తు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయం.

సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకముగా నిలిచిన పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికలను విజయంగా నిర్వహించండంలో శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో పోలీసులు





ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయము పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభతరం అయిందని తెలిపారు.

ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పి ఉపేంద్ర రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్ లు ప్రేమ్ కుమార్, గోపినాథ్, నవీన్ కుమార్, సైదా రావు, మల్లేష్, ప్రవీణ్ కుమార్, ఆర్.ఐ రమేష్, ఎస్ఐ లు సంజీవ్, సందీప్, రాహుల్, కె .సందీప్, సాయి కుమార్ , రవి కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు..



కుబీర్ :అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన కుబీర్ ఉన్నాత పాఠశాలలో నిర్వహించిన ఎమ్మెల్సి ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. దింతో మండలంలో ఉన్న గ్రాడయేట్ ఓట్లు 699ఉండగ అందులో 467మంది ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. ఉద్యుగులు 63కు 55మంది ఓటు చేశారని ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఎన్నికలు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగిసాయి. పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా 144సెక్షన్ విధించి పోలీస్ బందోబస్త్ చేపట్టడం జరిగింది. ఎన్నికలు పర్యవేకషన్ అధికారి నవనీత్ కుమార్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పోలింగ్ బూత్ లను పర్యవేక్షించారు కుబీర్ ఎస్ ఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ చేపట్టారు. దింతో బిఆర్ ఎస్ ముధోల్ నియోజక వర్గ ఇంచార్జ్ కిరణ్ కొమ్రే వార్ మరియు పార్టీ నాయకులు ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.

# భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన మౌనిష్ రెడ్డి



ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని టీచర్స్ కాలనీ అభయాంజనేయ ఆలయంతో పాటు భోరజ్ మండలం గూడ శివాలయన్ని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలుస్వీకరించారు. అనంతరం తలమడుగు మండలం ఝరి లయంలో అన్నప్రసాదానికి 2 క్వింటల్లు బియ్యం, నందిగామ ఆలయానికి వచ్చే భక్తులకోసం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు రమేష్, ప్రభాకర్, పురుషోత్తం యాదవ్, భగవండ్లు, నారాయణ సుభాష్, రతన్ నారాయణ్, రమేష్ విట్టల్, శివారెడ్డి, భూమారెడ్డి, రాకేష్ ఉన్నారు.

# బీఆర్ఎస్ క్యాలెండర్, డైరి ఆవిష్కరణ..



కుభీర్ :అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన కుబీర్ లో గురువారం బీఆర్ఎస్ ముధోల్ నియోజక వర్గ అధ్యక్షులు కిరణ్ కొమ్రే వార్ తెలంగాణ రాష్ట్ర సమితి క్యాలెండర్ మరియు డైరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముధోల్ నియోజక వర్గం లో ఉన్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తుందని అన్నారు. దింతో రైతులకు రైతు బందు విడుదల చేస్తామని చెప్పిన ఇప్పటి వరకు కనీసం రెండు ఎకరాలకు కూడా రైతు బందు డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. కేసిఆర్ ప్రభుత్వంలో రైతులకు సరైన సమయంలో రైతు బందును విడుదల చేసి రైతులకు పెట్టుబడి సహాయం అందించిన ప్రభుత్వం అంటే బిఆర్ ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎనిలా అనిల్ వైస్ ఎంపీపీ మోహియొద్దీన్ కందురు దత్తు, తెలంగాణ ఉద్యమ కారుడు పుప్పల పీరాజీ, గిరి పోశెట్టి దొంతుల లింగన్న, బాబు కాశినాథ్ వద్నామ్ దత్తు మండల బిఆర్ ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ముధోల్ లో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు .



ముధోల్ :అమృత్ తెలంగాణ: మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సిఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటింగ్ 77.12శాతం, టీచర్ ఎమ్మెల్సీ ఓటింగ్ 84.74 శాతం నమోదైనట్లు పీవో శ్రీకర్ తెలిపారు.ముధోల్ మండలంలోని 494 మంది పట్టభద్రులకు గాను 381 అట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అంటే ఇందులో 275 మంది పురుషులు. 106 మహిళ పట్టభద్రులు ఓటు వేశారు. మొత్తం 77.12శాతం ఓటింగ్ శాతం నమోదైంది. అలాగే ఎమ్మెల్సీ టీచర్ ఓటర్లు మొత్తం 118 ఉండగా అందులో 100 టీచర్స్ ఓటర్లు తమ ఓటు హొక్కు ను వినియోగించుకున్నారు ఇందులో 67 పురుషులు 33 మహిళలు తమ ఓటు వేశారు. అంటే 84.74శాతంఓటింగ్ నమోదయింది. పోలింగ్ కేంద్రాన్ని ఉదయం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ,ఏఎస్పీ అవినీష్ కుమార్లు సందర్శించి ఓటింగ్ సరళి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ,మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డిలు ఓటర్ సరళిని తమ తమ పార్టీ నాయకులకు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ముధోల్ సిఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం పూట మందకొడిగా సాగిన ఓటింగ్ సరళి మధ్యాహ్నం 12 గంటల నుండి పుంజుకుంది.

# జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ 20 పోలింగ్ లొకేషన్లో 39 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ మరియు విద్యావంతుల ఎన్నికలు. 400 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంది. సాయంత్రం ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు బందోబస్తు కొనసాగుతుంది.

# అమెరికా రాయబారితో జడ్పీహెచ్ఎస్ కాటాపూర్ విద్యార్థులు

తాడ్వాయి :అమృత్ తెలంగాణ: ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంఎస్ జెనీఫర్ లాడ్సన్, అమెరికన్ ఎంబసీ కౌన్సిల్ జనరల్ ఆఫ్ హైదరాబాద్ ఇండియా, ఎన్నారై కాటాపూర్ మాజీ విద్యార్థి ప్రముఖ పారిశ్రామికవేత్త రవి పులి గార్లతో విద్యార్థులకు వారి అభివృద్ధిపై ముఖాముఖి, ఇష్టా గోష్టి చర్చ నిర్వహించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సందర్శించిన అనంతరం అమెరికన్ ఎన్నారై రవి పులి గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులచే మాట ముచ్చట వారి భవిష్యత్తు ఎలా ఉండాలి ? ఏం చదువుకోవాలి ? ఎలా చదవాలి ?చదువులో అంచలంచెలుగా ఎలా ఎదగాలి ? అనే అంశంపై అమెరికన్ అంబర్ సి కౌన్సిల్ జనరల్ ఆఫ్ హైదరాబాద్ ఆఫ్ ఇండియా జెనీఫర్ లాడ్సన్ తో సంభాషించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఆనందంగా విద్యనభ్యసించాలని, విద్యతోనే భవిష్యత్తు నిర్మితమై ఉంటుందని చెప్పారు. భవిష్యత్తు నిర్మాణం మన గురువుల చేతిలో ఉంటుందని, వారిని గౌరవించుకుంటూ వారు చెప్పిన విద్యాబుద్ధులను చక్కగా వింటూ మన జ్ఞానాన్ని పెంచుకొని ఉన్నత చదువులు చదువుకొని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవడంలో మెలకువలు, ఇన్స్పిరేషన్ గా వారి సంభాషణ బాగుందని విద్యార్థుల ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్న, ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణాల సుధాకర్, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో విజ్ఞానవంతులుగా మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉంటుందని ఆమె అభివర్ణించారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు: సీఐ శ్రీనివాస్



దుబ్బాక :అమృత్ తెలంగాణ: నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, డ్రగ్స్, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విక్రయించినా.. వినియోగించినా.. చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశానుసారం సీఐ శ్రీనివాస్ నేతృత్వంలోని పోలీసు, డాగ్ స్క్వాడ్ బృందం గురువారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని పలు పాన్ షాప్ లు, కిరాణా షాపులపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ తనిఖీల్లో దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు, ట్రైనీ ఎస్సై నవీన్, డాగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తొగుటలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు..

తొగుట :అమృత్ తెలంగాణ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తొగుట ఎమ్మా ర్వో శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 73.3 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 95 శాతం పోలై నాయని ఆయన తెలిపారు. మండలంలో 620 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా 455 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నరని అన్నారు. 21 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో అందులో 12 మంది పురుష ఉపాధ్యాయులు, 8 మంది మహిళా ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఉద యం 8 గంటలకు ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 10 గంటల వరకు కొంత మంద కొడిగా సాగినా ఆ తర్వాత పుంజుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వ హించారు.

సాధారణ ఎన్నికలను తలపించిన ఎమ్మెల్సీ ఎన్నికలు..

సాధారణంగా గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల, ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికలకు ఎంతో హడావిడి కని పిస్తుంది.



ఆ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోని విధం గా గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కొనసాగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ బలపరచిన అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించడం కనిపించింది. ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపి పార్టీలు వారు బలపరచిన అభ్యర్థులను గెలిపిం చుకోవాలని ఆదేశాలు ఉండడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాభితా ప్రకారం ఓటర్లకు పోన్ కాల్సి చేసి మరీ పోలింగ్ కేంద్రాలకు రప్పించడం కనిపించింది. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థు లు లేకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించలేదు.

# చైనాలో ఎంబిబిఎస్.. అలా చేయక తప్పలేదంటున్న హీరోయిన్..!



ప్రొఫెషనల్ గా ఒకటి చేసి సినిమాల మీద ఆసక్తితో వెండితెరకు పరిచయమయ్యే వారు చాలామంది ఉంటారు. ప్రొఫెషనల్ గా ఒకటి చేసి సినిమాల మీద ఆసక్తితో వెండితెరకు పరిచయమయ్యే వారు చాలామంది ఉంటారు. ముఖ్యంగా డాక్టర్ అవుదామని కొందరు యాక్టర్ అవుతారు కానీ ఈమధ్య చాలా మంది డాక్టర్ అయ్యి కూడా యాక్టర్ అవుతున్నారు. హీరోయిన్స్ అంతా ఎక్కువగా డాక్టర్ కోర్స్ చేస్తూ సినిమాల్లోకి వస్తున్నారు. కొందరు రెండిటినీ ఒకేసారి చేస్తున్న వారు ఉన్నారు. మన స్టార్ హీరోయిన్స్ సాయి పల్లవి, శ్రీలీల కూడా ఓ పక్క డాక్టర్ చదువుతూ సినిమాలు చేస్తున్నారు. ఆ స్టార్ హీరో ఛాన్స్ ఇస్తాడా? ఐతే ఈమధ్య తెలుగు సినిమాల్లో తరచు కనిపిస్తున్న ఒక హీరోయిన్ కూడా ఎంబిబిఎస్ చేసి సినిమాల్లోకి ఎంటర్ అయ్యింది. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకునేందుకు ఎలాంటి పాత్రలు వచ్చినా చేస్తూ వస్తుంది కామాక్షి భాస్కర్ల. సినిమా పట్ల ఆమెకు ఉన్న అంకితభావం ఎలాంటిదో ఆమె చేస్తున్న పాత్రలు అందుకు ఆమె తీసుకుంటున్న కేర్ చూస్తే తెలుస్తుంది. పొలిమేర సీరీస్ లతో మెప్పిస్తున్న అమ్మడు వరుస సినిమాలతో బిజీగా ఉంది. కామాక్షి భాస్కర్ల రీసెంట్ గా తన ఎంబిబిఎస్ విషయాలను పంచుకుంది. చైనాలో ఎంబిబిఎస్ చేస్తున్న టైం లో అక్కడ ఏది దొరికితే అది తినేశానని అన్నది కామాక్షి. ఎక్కడికి వెళ్లినా అక్కడ వారు ఏం తింటారో అది తినేయడం అలవాటని. చైనాలో గ్రీనరీ అసలు ఉండదు. కూరగాయలు కూడా దొరకవు. అందుకే అక్కడ జీవులను చంపి తింటారు. ఆ టైం లోనే తనకు తేళ్లు, బొద్దింకలు తినడం అలవాటైందని అన్నారు. ప్రస్తుతం కామాక్షి మ్యాన్షన్ హౌస్ మల్లేష్, పొలిమేర 3 సినిమాల్లో నటిస్తున్నారు. డాక్టర్ గా ప్రొఫెషనల్ కోర్స్ చేసినా కూడా సినిమాల మీద ఆసక్తితో టాలీవుడ్ వచ్చి ఇక్కడ తన దాకా వస్తున్న ప్రతి పాత్రలు చేస్తూ వస్తుంది. ఐతే ఎలాంటి పాత్ర అయినా తెర మీద తన ప్రతిభ చాటడమే ముఖ్యం అనిపించేలా చేస్తున్న కామాక్షి రానున్న రోజుల్లో మరిన్ని సర్ ప్రైజింగ్ రోల్స్ చేసి అలరించాలని చూస్తుంది. ఇలాంటి పాత్ర అయితేనే చేస్తా అని కండీషన్స్ ఏమి లేకుండా ఇచ్చిన పాత్రతో ప్రేక్షకులను మెప్పిస్తున్న కామాక్షికి కచ్చితంగా త్వరలోనే కెరీర్ టర్న్ తిప్పే రోల్స్ పడతాయని ఆడియన్స్ చెబుతున్నారు.

# ప్రభాస్ లుక్ టెస్ట్... ఫలితం ఇదే!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చాలా సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చాలా సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఏడాదిలో మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా విడుదల కానుంది. సమ్మర్ చివరి వరకు రాజాసాబ్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమాను సైతం ఇదే ఏడాది చివరి వరకు విడుదల చేయాలని భావిస్తున్నారు. వచ్చే ఏడాది సైతం ప్రభాస్ సినిమాలు లైన్‌గా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. స్పిరిట్, కల్కి 2, సలార్ 2 సినిమాల షూటింగ్స్ చేయాల్సి ఉండగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో సినిమాకు ప్రభాస్ ఓకే చెప్పాడు. మోక్షజ్ఞ సినిమాను క్యాన్సల్ చేసుకున్న ప్రశాంత్ వర్మ తన తదుపరి సినిమాను ప్రభాస్‌తో కన్ఫర్మ్ చేశాడని టాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. జై హనుమాన్ సినిమా ముగింపు దశకు వచ్చింది. వచ్చే ఏడాదిలో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో ప్రభాస్‌తో సినిమాకు సైతం ప్రశాంత్ వర్మ రెడీ అవుతున్నాడు. ఇటీవల సినిమా కోసం ప్రభాస్ లుక్ టెస్ట్‌కి హాజరు అయ్యాడు. సాధారణంగా ప్రభాస్ వంటి స్టార్ హీరో లుక్ టెస్ట్‌కి హాజరు కావాల్సిన అవసరం లేదు. కానీ విభిన్నమైన గెటప్‌లో కనిపించాల్సి వస్తే అప్పుడు లుక్ టెస్ట్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. రెండు మూడు వేరియేషన్స్‌లో లుక్ టెస్ట్ చేస్తారు. ప్రశాంత్ వర్మ సినిమా కోసం ప్రభాస్ లుక్ టెస్ట్ పూర్తి అయింది. ఒక లుక్‌ను ఫైనల్ చేశారు. ప్రభాస్ ఆ పాత్రకు సెట్ అవుతాడు అనే నమ్మకం ప్రశాంత్ వర్మకు కలిగిందట. అందుకే తదుపరి స్టెప్‌కి రెడీ అవుతున్నారు. హంబులే నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుందని తెలుస్తోంది. ప్రభాస్‌తో సలార్ సినిమాను నిర్మించిన ఈ నిర్మాణ సంస్థ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో భారీ బడ్జెట్ సినిమాకు రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభాస్, ప్రశాంత్ వర్మ కాంబో మూవీ గురించి సోషల్ మీడియాలో, సినీ సర్కిల్స్‌లో రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా కథను మొదట రణ్వీర్ సింగ్‌కు ప్రశాంత్ వర్మ చెప్పాడట. పుకార్లపై దర్శకుడి ప్రకటన! గత ఏడాదిలో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రణ్వీర్ సింగ్ సినిమా చర్చలు జరిగాయి. అధికారికంగా ప్రకటన వచ్చే సమయంలో కొన్ని విభేదాల కారణంగా ప్రాజెక్ట్‌ను పక్కకు పెట్టాల్సి వచ్చింది. కారణం ఏంటి అనేది ఏ ఒక్కరూ చెప్పలేదు. కానీ ప్రశాంత్ వర్మ అదే కథను ఇప్పుడు ప్రభాస్‌కి చెప్పి ఒప్పించారని, రాక్షస్ టైటిల్‌తో ఈ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అధికారికంగా ఈ సినిమా గురించి క్లారిటీ రావాల్సి ఉంది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న బిజీ కారణంగా వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా ఉండే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ప్రశాంత్ వర్మ సైతం 'జై హనుమాన్' షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. కనుక వీరి కాంబో మూవీ లుక్ టెస్ట్ పాస్ అయినా పట్టాలు ఎక్కడానికి సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న కుబేర

విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా కుబేర. ప్రస్తుతం టాలీవుడ్ లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్టుల్లో కుబేర కూడా ఒకటి. ఈ చిత్రాన్ని జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తుండగా, రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుంది. బాలీవుడ్ లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జిమ్ సర్భ్ కుబేరలో ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడు.






నభానటేష్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com